# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో దృశ్య మాధ్యమ సమావేశం జరుగుతోంది.

❖ రాష్ట్రాలకు వాణిజ్య ఎల్‌పిజి కేటాయింపును 70 శాతానికి పెంచాలని కేంద్రం నిర్ణయించింది.

❖ దేశీయ వినియోగం కోసం ఉద్దేశించిన పెట్రోల్, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది.

❖ దేశంలో లాక్‌డౌన్ విధిస్తారంటూ వస్తున్న వదంతులు నిరాధారమైనవని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఇందన సంక్షోభం నేపథ్యంలో దేశంలోని పరిస్థితిని సమీక్షించేందుకు న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో దృశ్య మాధ్యమ సమావేశం జరుగుతోంది. సమిష్టి జట్టు స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కలిసి పని చేయడంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారిస్తుంది. అయితే, ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఈ సమావేశానికి హాజరు కాలేదు.

= = = = = = = = = = = = = = = = =

దేశంలోని రాష్ట్రాలకు వాణిజ్య ఎల్‌పిజి కేటాయింపును 70 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉక్కు, ఆటోమొబైల్, వస్త్ర పరిశ్రమలతో పాటు ఇతర కార్మిక ఆధారిత పరిశ్రమలకు 20 శాతం కేటాయింపు చేస్తున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడించారు. వాణిజ్య ఎల్‌పిజి సరఫరాను సులభతరం చేయడమే ఈ చర్య లక్ష్యమని సామాజిక మాధ్యమంలో ఆయన పేర్కొన్నారు. పైపుల ద్వారా వచ్చే గ్యాస్ ప్రత్యామ్నాయం కాని పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రపంచంలోని ఇతర దేశాలు కఠినమైన ఇంధన పొదుపు చర్యలు తీసుకుంటుండగా... భారతదేశం ఇంధన భద్రత, లభ్యత, అందుబాటు ధరలకు ఒక స్వర్గధామంగా నిలుస్తోందని మంత్రి హర్దీప్ సింగ్ పూరి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = =

దేశీయ వినియోగం కోసం పెట్రోల్, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు 10 రూపాయలు తగ్గించింది. ఇది తక్షణమే అమలయ్యేలా నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు కేవలం నాలుగు వారాల్లోనే దాదాపు 75 శాతం మేరకు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ఇంధన ధరల నుండి దేశ పౌరులు, పరిశ్రమలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఎక్సైజ్ సుంకం తగ్గింపుతో పాటు.. ప్రభుత్వం డీజిల్ ఎగుమతులపై `ఎగుమతి పన్ను`ను కూడా ప్రవేశపెట్టింది. డీజిల్ ఎగుమతులపై లీటరుకు 21 రూపాయల 50 పైసలు, విమాన ఇంధనం (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్) ఎగుమతులపై లీటరుకు 29 రూపాయల 50 పైసలు చొప్పున సుంకాలను విధించింది.

= = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలన్న నిర్ణయం 140 కోట్ల మంది భారతీయులను అంతర్జాతీయ అనిశ్చితి నుండి కాపాడటానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న ఒక సాహసోపేతమైన చర్య అని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. దేశీయ వినియోగం కోసం పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని లీటర్ కు 10 రూపాయలు తగ్గించడంతో పెరుగుతున్న ధరల నుండి వినియోగదారులకు కొంత ఊరట లభిస్తుందన్నారు. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై ఎగుమతి సుంకాలు విధించడం వల్ల దేశీయంగా తగినంత లభ్యత ఉంటుందని ఆయన తెలిపారు. దేశ ప్రజల జీవన సౌలభ్యాన్ని, ధరలను అందుబాటులో ఉంచడానికి  ప్రభుత్వం అనుసరిస్తున్న “పౌరుడే ప్రథమం” విధానంలో ఇది ఒక భాగమని జైశంకర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = =

దేశంలో పెట్రోల్, డీజిల్ వంటి ఇందన ధరలు పెరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆమె ఈరోజు మాట్లాడుతూ... పశ్చిమాసియాలోని ఉద్రిక్తల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ATF)ల కొరత ఉండకూడదని, ప్రపంచ పరిస్థితి కారణంగా వాటి ధరలను పెంచకూడదని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం తగ్గించిందని, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. తద్వారా వారు ఈ ముడి పదార్థాన్ని దిగుమతి చేసుకోగలరని తెలిపారు. సామాన్య ప్రజలు ఎలాంటి ధరల పెరుగుదలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదని నిర్మలా సీతారామన్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = =

దేశంలో లాక్‌డౌన్ విధిస్తారంటూ వస్తున్న వదంతులు నిరాధారమైనవని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. ప్రభుత్వం వద్ద అటువంటి ప్రతిపాదనలు ఏమి లేవని స్పష్టం చేశారు. ప్రపంచ పరిస్థితి అస్థిరంగా ఉన్నందున ఇంధనం, సరఫరా గొలుసులు, నిత్యావసర వస్తువుల రంగాలలో జరుగుతున్న పరిణామాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షిస్తోందని కేంద్రమంత్రి సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. పౌరులకు ఇంధనం, విద్యుత్, ఇతర కీలక సరఫరాలు నిరంతరాయంగా అందేలా చూసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, భవిషత్‌లో తలెత్తే సవాళ్లను ఎదుర్కోవడానికి

భారత్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో దేశం స్థైర్యాన్ని ప్రదర్శించిందని, ఇకపైనా కూడా చురుకుగా, సమన్వయంతో వ్యవహరిస్తూనే ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా.. బాధ్యతాయుతంగా, ఐక్యంగా ఉండాలని కేంద్రమంత్రి కోరారు.

= = = = = = = = = = = = = = = = =

ప్రపంచ జెనరిక్ మందులలో 30 శాతాన్ని భారతదేశం సరఫరా చేస్తోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె ఈరోజు సమాధానమిస్తూ... భారతదేశం ప్రపంచానికి ఔషధశాలగా, అతిపెద్ద జెనరిక్ మందుల తయారీ, ఎగుమతిదారుగా కొనసాగుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సరసమైన ఆరోగ్య సంరక్షణలో భారత్ తన పాత్రను ప్రతిబింబిస్తూ.. అంతర్జాతీయంగా దాదాపు 30 శాతం జెనరిక్ మందులను సరఫరా చేస్తోందన్నారు. సామాన్య పౌరుల ఆరోగ్య సంరక్షణ ఖర్చులను తగ్గించడంతో పాటు.. దేశంలో జెనరిక్ మందుల వినియోగాన్ని పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి తెలిపారు. వైద్యులు జెనరిక్ మందులను సూచించాలని ప్రభుత్వం ఒక స్పష్టమైన నిబంధనను అమలులోకి తెచ్చిందని, అదే విధంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో దీనిని మరింత పటిష్టంగా అమలు చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పని చేస్తోందన్నారు. ఔషధ నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అనుప్రియ పటేల్ వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా రైల్వేకు చెందిన భూమిలో కేవలం 0.21 శాతం మాత్రమే అక్రమ ఆక్రమణల కింద ఉందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ సమస్య అనేక పట్టణ ప్రాంతాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, దీనిని మానవతా దృక్పథంతో పరిష్కరిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈరోజు రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... రైల్వే భూమిలో అత్యధిక భాగం ఇప్పటికే కార్యాచరణ, భద్రతా అవసరాల కోసం ఉపయోగించబడుతోందని తెలిపారు. దాదాపు 80 శాతం రైల్వే భూమి రైలు పట్టాలతో నిండి ఉందని, అయితే సుమారు 5 శాతం భూమిని పట్టాలకు ఆనుకుని భద్రతా మార్జిన్‌గా నిర్వహిస్తున్నారని చెప్పారు. మిగిలిన 15 శాతాన్ని స్టేషన్లు, రైల్వే కాలనీలు, ఆసుపత్రులు ఇతర రైల్వే సంబంధిత సౌకర్యాల కోసం వినియోగిస్తున్నట్లు అశ్విని వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = =

దేశ రక్షణ సామర్థ్యాలను పెంపొందించేందుకు సుమారు 2 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రతిపాదనలకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈరోజు జరిగిన రక్షణ సేకరణ మండలి సమావేశంలో దీనికి ఆమోదం లభించినట్లు ఆ మంత్రిత్వ శాఖ పేర్కొంది. భారత సైన్యానికి చెందిన ఎయిర్ డిఫెన్స్ ట్రాక్డ్ సిస్టమ్, ఆర్మర్డ్ పియర్సింగ్ ట్యాంక్ ఎమ్యూనిషన్, హై కెపాసిటీ రేడియో రిలే, ధనుష్ గన్ సిస్టమ్, రన్‌వే ఇండిపెండెంట్ ఏరియల్ సర్వైలెన్స్ సిస్టమ్‌లకు ఆమోదం లభించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = =